

4

**బోడగుట్ట దోపిడీపై మౌనం**
**బాధ్యత ఎవరిది?**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -315 బుధవారం18 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## కాబూల్ ఆసుపత్రిపై పాక్ దాడి..

- ఘటనలో 400 మందికి పైగా మృతి..
- 250 మందికి గాయాలు
- ఇది సైనిక చర్య కాదు.. మారణహోమం అని ఖండించిన భారత్
- రంజాన్ మాసంలో దాడి చేయడం పాక్ కిరాతక చర్య అని విమర్శ
- పాక్‌ను జవాబుదారీ చేయాలని అంతర్జాతీయ సమాజానికి భారత్ పిలుపు



**కాబూల్(**
ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 400 మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

# హీటెక్కిన అసెంబ్లీ

## కాంగ్రెస్ హామీలపై ప్రశ్నించిన కేటీఆర్
## తిప్పికొట్టిన అధికారపక్షం





- సభను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ మంత్రుల ఆగ్రహం
- బ్యాంకు లింకేజితో కలిపి రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణమిచ్చాం: భట్టి
- వడ్డీలేని రుణాలు ఇచ్చినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తా..
- లేకుంటే భట్టి చేయాలి : కేటీఆర్
- రూ. 56 వేల కోట్ల ఒప్పందాలు చేసుకున్నాం : మంత్రి శ్రీధర్‌బాబు
- మహిళలంటే ఎందుకంత చులకన? : మంత్రి సీతక్క
- స్పీకర్ అందరి హక్కులనూ కాపాడాలి : తలసాని
- గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో గరంగరం

**హైదరాబాద్/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం సాగింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సభ్యులు అధికార పక్షం తప్పులను ఎత్తిచూపితే, బీఆర్ఎస్ వైఫల్యాలను అధికార పక్షం ఎండగట్టింది. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. కాంగ్రెస్ సభ్యులు బాలూనాయక్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, విప్ ఆది శ్రీనివాస్ బలపర్చారు. వారిద్దరూ తీర్మానంపై మాట్లాడారు. చర్చలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు (కేటీఆర్) కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోని అంశాలను చదువుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ప్రయత్నం చేశారు. ఆరుగ్యారంటీల అమలుపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఎవరి వాదనలు వారు వినిపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఊదరగొట్టిందంటూ కేటీఆర్ చేసిన విమర్శలపై మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళా సంఘాలకు వడ్డీ చెల్లించకుండా ఎగొట్టారంటూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. కేటీఆర్ విమర్శలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డిదుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క ధీటుగా సమాధానం చెప్పారు.


### జీరో వ్యాల్యూ సీఎం420 సర్కార్ : కేటీఆర్

'గవర్నర్ ప్రసంగానికి విశ్వసనీయత, గౌరవం లేదు. సీఎం సంతకానికి జీరో వ్యాల్యూ. ప్రజల దృష్టిలో కాంగ్రెస్ సర్కార్‌కు జీరో వ్యాల్యూ. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేసిన ఫైలు ఎక్కడకు పోయింది? **మిగతా 2లో...**

## దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

- పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే
- పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం
- ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే.. ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు **మిగతాది 2లో...**





## సిట్‌కు డ్రగ్స్ కేసు

- మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు.. సిట్ ఏర్పాటు
- రెండు రోజుల క్రితం రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌పై ఈగల్ పోలీసుల దాడి
- 11 మందిని పరీక్షించగా ఆరుగురికి పాజిటివ్
- పైలట్ రోహిత్ రెడ్డి, మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్
- ఈ కేసు దర్యాప్తు కోసం సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు

**2లో.**

## దివ్యాంగులకు ఉగాది కానుక..
### ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం..

- నేడు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం
- సహాయకులకు 50 శాతం రాయితీ
- రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మందికిపైగా దివ్యాంగులకు లబ్ధి
- దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించనున్న చంద్రబాబు, పవన్

**2లో.**




## తోపుడు బండితో అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు...

- రైతుల వినతిపత్రాలతో అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు
- తోపుడు బండిని గేటు వద్దే అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది





**2లో.**

## హ్యాం రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణం

### హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
### : మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్ /మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో హ్యాం రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్ రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీలో మీడియాతో వారు చిట్‌చాట్ నిర్వహించారు. ఆర్ అండ్ బీ రూ.12 వేల కోట్లు, పంచాయతీరాజ్ శాఖ రూ.ఆరు వేల కోట్లలో పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు పెట్టారని అన్నారు. రూ.1,800 కోట్లు నేరుగా వస్తాయనీ, వాటిని నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు పంపేందుకు ప్రణాళిక రూపొందించారని చెప్పారు. జలయజ్ఞం కాదు ధనయజ్ఞమనీ, జేబులు దండుకుంటున్నారనీ, నాడు తెలుగుదేశం, రేవంత్‌రెడ్డి అంతటా ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కమీషన్ల కోసమే హ్యాం రోడ్ల పేరుతో రూ.వేల కోట్లు దండుకునేందుకు ప్రణాళిక వేశారని అన్నారు. దేశం మొత్తం జాతీయ రహదారులు సాధారణంగా 20 నుంచి 30 శాతం వరకు టెండర్లు తక్కువ ధరకు**మిగతాది 2లో...**



## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం

- కేసీఆర్, కేటీఆర్ వస్తారా?: మహేశ్ కుమార్ గౌడ్ సవాల్
- తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతున్న డ్రగ్స్ వ్యవహారం
- డ్రగ్స్ విచ్చలవిడిగా దొరకడానికి బీఆర్ఎస్ పాలనే కారణమన్న మహేశ్ గౌడ్
- ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాఖ్య
- ఫామ్‌హౌస్‌లో పట్టుబడింది మీ నాయకుడు కాదా? అని ప్రశ్న

**2లో.**



## హైదరాబాద్‌లో రూ.1,650 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా




**2లో.**



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..

**3లో.**

# సిట్ కు డ్రగ్స్ కేసు

**హైదరాబాద్,/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు? ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు? వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి సిట్ నివేదికను అందించనుంది. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

## దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

పొందడానికి అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం.. 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఈ క్రమంలో పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులకు 12 వారాల మాతృత్వ సెలవులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది.

## హ్యాం రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణం

**(మొదటి పేజి తరువాయి)**

వెళ్తాయని చెప్పారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో 15 నుంచి 20 శాతం అధిక ధరకు వెళ్తున్నాయని వివరించారు. తేడా 50 శాతం వస్తోందన్నారు. సీఓటీకి వెళ్లకుండా నేరుగా శాఖాపరమైన కమిటీ ఆమోదించేలా చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని రద్దు చేసిందని గుర్తు చేశారు. నాడు జలయజ్ఞంలో మూడు శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఉంటేడ ఇప్పుడు పది శాతానికి పెంచారని వివరించారు. మొత్తం 34లో ఇప్పటి వరకు తెరిచిన 24 టెండర్ల సాంకేతిక బిడ్లు చూస్తే దాదాపు 16 టెండర్లలో ఇద్దరు మాత్రమే వేశారని చెప్పారు. ముందే రింగ్ అయ్యారని విమర్శించారు. కుమ్మక్కై ముందే మాట్లాడుకుని అధిక ధరకు టెండర్ వేసేలా చేశారని అన్నారు. ఇప్పటివరకు టెండర్ ధరలో ఐదు శాతం మాత్రమే ఎక్కువకు వెళ్లేలా సీలింగ్ ఉండేదనీ, ఇప్పుడు హ్యాం రోడ్లకు ఆ నిబంధనను ఎత్తేయడంతో ఎంత ఎక్కువకు అయినా వేసుకోవచ్చని చెప్పారు. హ్యాం రోడ్ల టెండర్లలో పెద్ద కుంభకోణం జరిగిందని విమర్శించారు. నల్లగొండలో రెండు కంపెనీలు మాత్రమే టెండర్లు వేశాయన్నారు. టెండర్లలో అవినీతి జరిగిందనీ, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు, రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేస్తామన్నారు. టెండర్లలో పాలు పంచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లపై బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పద్దులు చర్చకు వచ్చినపుడు బీఆర్ఎస్ తరపున మరిన్ని ఆధారాలు బయటపెడతామని చెప్పారు. హైకోర్టు విచారణకు పట్టుబడతామని అన్నారు. సింగరేణి శ్రీరాంపూర్ టెండర్ వ్యవహారాన్ని తాము బయటపెట్టిన తర్వాత తక్కువ టెండర్‌కు పోయిందని గుర్తు చేశారు.

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం...

**హైదరాబాద్, /మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ శాసనమండలి వేదికగా డ్రగ్స్ వ్యవహారంపై ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో గంజాయి, కొకైన్ విచ్చలవిడిగా దొరకడానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనే కారణమని ఆయన ధ్వజమెత్తారు.రాష్ట్రంలో బిస్కెట్లు, చాక్లెట్ల మాదిరి డ్రగ్స్ లభిస్తున్నాయని, కొందరు నాయకులు స్వయంగా డ్రగ్స్ వ్యాపారం చేయడం సిగ్గుచేటని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. డ్రగ్ టెస్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని... మరి ప్రతిపక్ష నేత కేసీఆర్, కేటీఆర్ ముందుకు వస్తారా? అని ఆయన ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "మీరు అంగీకరిస్తే రేపే ముహూర్తం పెడదాం, ముఖ్యమంత్రిని ఒప్పించే బాధ్యత నాది" అని సవాల్ చేశారు. ప్రజాప్రతినిధులందరూ పరీక్షలు చేయించుకుని సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ తరపున బీ-ఫామ్స్ అందుకున్న వారందరినీ తాము టెస్టులకు తీసుకువస్తామని, అదే ధైర్యం ఉంటే బీఆర్ఎస్ కూడా వారి సభ్యులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో పట్టుబడింది మీ నాయకుడు కాదా? అని ప్రశ్నిస్తూ, డ్రగ్స్ మాటెత్తగానే బీఆర్ఎస్ నాయకుల పేర్లే ఎందుకు బయటకు వస్తున్నాయని నిలదీశారు. పదేళ్లలో రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా జరిగిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే పార్టీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఈగల్ టీమ్'ను ఏర్పాటు చేసి పరిస్థితిని చక్కదిద్దుతున్నారని, గతంలో టెస్టులకు భయపడి పారిపోయిన వారు ఎవరో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ఒకవైపు పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేయడం, మరోవైపు మండలిలో మహేశ్ కుమార్ గౌడ్ విసిరిన ఈ 'డ్రగ్ టెస్ట్' ఛాలెంజ్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి.

## హైదరాబాద్‌లో రూ.1,650 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, /మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**:నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో రూ.1,650 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం, 5 ఎకరాలు శ్మశాన వాటిక కోసం, 4 ఎకరాల డంప్ యార్డుకు చెందినదిగా ఉంది. రంగరెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సెంట్రల్ పార్కు కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1 లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర సెంట్రల్ పార్కు కాలనీ ఫేజ్-1 పేరుతో 1998లో లే ఔట్ వేశారు.
ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా, మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేశారు. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను తొలగించింది. 2 ఎకరాల పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

**ప్రగతినగర్‌లో 9 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**
ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న 5 ఎకరాల శ్మశానవాటిక, పక్కనే ఉన్న 4 ఎకరాల డంపింగ్ యార్డు ఆక్రమణలకు గురౌతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో విచారించింది.

# కాబూల్ ఆసుపత్రిపై పాక్ దాడి..

**(మొదటి పేజి తరువాయి)**

ఇది సైనిక చర్య ముసుగులో జరిగిన మారణహోమం అని, పాకిస్థాన్ చర్య క్షమించరానిదని మండిపడింది.
తాలిబన్ ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 9 గంటల సమయంలో కాబూల్‌లోని 2,000 పడకల సామర్థ్యం గల 'ఉమిద్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్'పై పాక్ వైమానిక దాడులు జరిపింది. ఈ ఘటనలో 400 మందికి పైగా మరణించగా, మరో 250 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) తీవ్రంగా స్పందించింది. "ఇది పిరికిపంద చర్య, క్షమించరాని హింస. సైనిక లక్ష్యం కాని ఒక వైద్య సదుపాయంపై దాడి చేసి ఇంత మంది పౌరుల ప్రాణాలను తీయడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించలేం. పాకిస్థాన్ ఇప్పుడు ఒక మారణకాండకు సైనిక చర్య అని పేరు పెట్టే ప్రయత్నం చేస్తోంది" అని తన ప్రకటనలో



పేర్కొంది.పాక్ చేపట్టిన ఈ దుశ్చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దారుణమైన దాడి అని, ఇది ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ప్రత్యక్ష ముప్పు అని భారత్ స్పష్టం చేసింది. తన అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సరిహద్దుల ఆవల హింసకు పాల్పడటం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని, దాని బాధ్యతారహిత ప్రవర్తనకు ఇది నిదర్శనమని విమర్శించింది.
ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు శాంతి, కరుణకు ప్రతీకగా భావించే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత హేయమైన చర్య అని భారత్ పేర్కొంది. "ఒక ఆసుపత్రిని, అక్కడి రోగులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏ మతం, ఏ చట్టం, ఏ నైతికత సమర్థించదు" అని వ్యాఖ్యానించింది. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీ చేయాలని, ఆఫ్ఘన్ పౌరులపై పాక్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని భారత్ పిలుపునిచ్చింది.
ఈ విషాద సమయంలో ఆఫ్ఘనిస్థాన్ ప్రజలకు భారత్ సంఘీభావం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారానికి, ప్రాదేశిక సమగ్రతకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపింది.

# దివ్యాంగులకు ఉగాది కానుక..

## ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం..

**/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు రేపు (మంగళవారం) మంగళగిరిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. గతేడాది డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పుడు నెరవేరుస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరుకానున్నారు.ఈ పథకం ద్వారా 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. వారితో పాటు ప్రయాణించే సహాయకులకు టిక్కెట్‌లో 50 శాతం రాయితీ లభిస్తుంది. గతంలో పరిమిత వర్గాలకే వర్తించిన ఈ సౌకర్యాన్ని ఇప్పుడు 4 నుంచి 21 కేటగిరీల దివ్యాంగులకు విస్తరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 11.16 లక్షల మంది దివ్యాంగులు, వారి సహాయకులతో కలిపి మొత్తం 12.76 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లను ఆర్టీసీకి చెల్లించనుంది. మహిళల కోసం ఉద్దేశించిన 'స్త్రీ శక్తి' బస్సుల్లో కూడా దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.మంగళగిరిలో పథకాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్ తదితరులు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణిస్తారు. ప్రయాణం ముగిశాక ముఖ్యమంత్రి వారి కోసం ప్రత్యేకంగా ఆత్మీయ విందు ఏర్పాటు చేయనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ స్థానిక ఎమ్మెల్యేలు 'దివ్యాంగ శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వారు కూడా దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, అనంతరం వారితో కలిసి భోజనం చేస్తారు.ఇప్పటికే ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం విజయవంతంగా కొనసాగుతోందని, ఈ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 52 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు చేశారని ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం కోసం రూ. 1,826 కోట్లకు పైగా ఖర్చును భరిస్తున్నట్లు పేర్కొంది. ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' ద్వారా మరో కీలక వర్గానికి భరోసా కల్పిస్తోంది.

# తోపుడు బండితో అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు...

**హైదరాబాద్, /మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ వద్ద వినూత్న నిరసనకు దిగారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని, రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, రైతుల నుంచి సేకరించిన వినతిపత్రాలను ఓ తోపుడు బండిపై పెట్టుకుని అసెంబ్లీకి చేరుకున్నారు.ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ నాయకత్వంలో, వారి మద్దతుదారులతో కలిసి అసెంబ్లీ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం నుంచి నిరసన ప్రారంభించారు. ఫసల్ బీమాను అమలు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రైతుల వినతులను ప్రభుత్వానికి అందజేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని వారు తెలిపారు. అయితే, అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. తోపుడు బండిని లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. వినతిపత్రాలను తమకు అందజేస్తే, సంబంధిత అధికారులకు చేరవేస్తామని భద్రతా సిబ్బంది హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని, రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేయాలని, రైతు భరోసా నిధుల విడుదలలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి బడ్జెట్‌లో ఫసల్ బీమా అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ పంటల బీమా పథకం కూడా అమలు కావడం లేదని విమర్శించారు.
ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రైతులను మోసం చేసిందని ఎమ్మెల్యే హరీశ్ అన్నారు. రైతు భరోసా పథకం కింద కూడా రైతులకు ఆర్థిక సాయం అందడం లేదని, తగిన సమయంలో ప్రభుత్వంపై రైతులు తమ ఆగ్రహాన్ని చూపిస్తారని హెచ్చరించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. రైతులు తమ సమస్యలను వివరిస్తూ ఇచ్చిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేయాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చామని మరో ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.

# హీటెక్కిన అసెంబ్లీ

**(మొదటి పేజి తరువాయి)**

ఆ ఫైలును వెలికితీసేందుకు సిట్ వేయాలి' అని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు అసెంబ్లీలో డిమాండ్‌చేశారు. ఆరు గ్యారంటీల విషయంలో రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగం తప్పులతడక అని విమర్శించారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్టుగా కాంగ్రెస్ పాలన ఉందన్నారు. కమీషన్లు, డైవర్షన్లు, బుల్డోజర్ల చప్పుళ్లు, అప్పులు, బూతుల మోతలు తప్ప ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అప్పుల్లో తెలంగాణ ఆల్‌టైం రికార్డు సృష్టించిందని విమర్శించారు. 420 హామీల మ్యానిఫెస్టో అమలు ఏమైంది? ఒక్కో కుటుంబానికి రూ.2.50 లక్షలు ఎక్కడ అందుతున్నాయి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పెన్షన్లు పెంచి ఇవ్వనందుకు ధన్యవాదాలు తెలపాలా? నిరుద్యోగులకు భృతి, ఉద్యోగాలు భర్తీ విస్మరించినందుకు ధన్యవాదాలు తెలపాలా? అని నిలదీశారు. ఎన్నికలకు ముందు ప్రచారంలో రేవంత్‌రెడ్డి దానకర్ణుడిలా మాట్లాడి, ఓట్లు వేశాక కుంభకర్ణుడిలా నిద్రిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా 2014-23 మధ్య కాలంలో ఇచ్చిన రేషన్‌కార్డుల గురించి ప్రస్తావించారు. గవర్నర్ ప్రసంగంలోనే రెండున్నరేండ్ల పాలనలో ఐటీ రంగంలో ఏడు వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని ఉందని ఎత్తిచూపారు. ఐటీ ఎగుమతులు, గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడుల ఒప్పందాలపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతున్నదని విమర్శించారు. సీఎం, మంత్రులు నిధులు తేవడానికి ఢిల్లీకి వెళ్లడం లేదనీ, ఢిల్లీకి వెళ్లి నిధులు ఇచ్చి వస్తున్నారని ఆరోపించారు. మహిళలకు రూ. 57వేల కోట్ల వడ్డీలేని రుణం ఇచ్చినట్టు కాగితం చూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ కేటీఆర్ సవాల్ విసిరారు. లేదంటే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తన పదవి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మూడుసార్లు రైతుబంధు ఆపారని విమర్శించారు. వరికి బోనస్ విషయంలో కొర్రీలు పెట్టిన కాంగ్రెస్‌ఉమిగతా పంటలకు బోనస్ ఇవ్వడం లేదన్నారు. మహిళలకు రూ. 2500, ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. గురుకులాల్లో విషాహారం తిని రెండు వందల మందికిపైగా పిల్లలు చనిపోయారని చెప్పారు. విదేశీ విద్యా నిధులను ఆపేసి విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున భూముల పందేరానికి తెరలేపిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 16 వేల కోట్లతో మూసీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తే, కాంగ్రెస్ సర్కారు దాన్ని రూ.1.5 లక్షల కోట్లకు అంచనా వేసిందని చెప్పారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ల కోసం పేదల ఇండ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో గ్రాఫిక్స్ మాయాజాలం చేస్తున్నారన్నారు. జర్నలిస్టులపైనా, సోషల్‌మీడియాపైనా అణిచివేతకు పాల్పడుతున్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలని సర్కారు భావిస్తోందనీ, అది సాధ్యం కాదని స్పష్టం చేశారు.

**మహిళలు అంటే ఎప్పుడూ చులకనే : మంత్రి సీతక్క**
బీఆర్ఎస్‌కు మహిళలు అంటే ఎప్పుడూ చులకనే అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. బ్యాంక్ లింకేజి ద్వారా మహిళా సంఘాలకు రూ. 57వేల కోట్లు వడ్డీలేని రుణం ఇచ్చామన్నారు. 99శాతం మహిళా సంఘాలు తీసుకున్న అప్పుకు రీపేమెంట్ బాగా చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభయహస్తం రూ. 3వేల కోట్లు ఎగొట్టిందన్నారు.

**ఓపిక తెచ్చుకోండి : మంత్రి కోమటిరెడ్డి**
కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. రేషన్ కార్డులు ఇచ్చినందుకు, యంగ్ ఇండియా స్కూల్ కట్టిస్తున్నందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నందుకు, సన్నవడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని కేటీఆర్‌కు సూచించారు. తమ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు రూపాయల అప్పులు చేసిపోతే ఒప్పందాల్లో భాగంగా పదేండ్ల తర్వాత తమ ప్రభుత్వం వడ్డీలు కడుతున్నదనీ, అప్పుల రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకు కేటీఆర్ తమ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఓపికగా ఉండాలని హితవుపలికారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టినందుకు రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**కంపెనీల ఒప్పందాలపై శ్వేతపత్రం : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**
బయట ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు తెచ్చి కేటీఆర్ చదువుతున్నట్టు ఉందని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. బీఆర్ఎస్ మాదిరిగా ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు కేంద్రం చుట్టూ తిరగట్లేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క అడుగు తగ్గి అయినా కేంద్రం దగ్గరకు వెళ్తామని చెప్పారు. తమది జాతీయ పార్టీ అనీ, ఢిల్లీ రాజకీయాలు తప్పనిసరిగా ఉంటాయని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఫ్లాప్ కాలేదన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది బీఆర్ఎస్ పార్టీ అని ఎత్తిచూపారు. ఆయా కార్పొరేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం రూ. ఆరు లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నదనీ, త్వరలోనే ఆ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. చేసుకున్న ఒప్పందాల్లో 35 శాతమే అమలవుతాయని మహారాష్ట్ర ప్రభుత్వ అనుభవం తెలుపుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఐటీ అభివృద్ధి, ఎగుమతులు, ఎంఓయూల విషయంలో సంఖ్యాపరంగా తేడాలుంటే సరిచేసుకుంటామని స్పష్టం చేశారు. ఫార్మాసిటీలో గ్రీన్ ఫార్మాకు ప్రాధాన్యత ఇస్తున్నామనీ, ఇదే విషయాన్ని కోర్టుకు చెప్పామని తెలిపారు. ప్రతి అంశాన్నీ గోబెల్స్‌ను మించి ప్రచారం చేయడంలో కేటీఆర్‌ను మించిన వారు లేరని ఎద్దేవా చేశారు. కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మంథనిలోజంట హత్యలకు కారకులెవరని కేటీఆర్‌ను ప్రశ్నించారు. దానిపై సీబీఐ విచారణ జరుగుతోందన్నారు.

**మహిళలకు రూ. 57వేల కోట్ల వడ్డీ లేని రుణం ఇచ్చాం : భట్టి**
తమ ప్రభుత్వం మహిళలకు రూ.57వేల కోట్ల వడ్డీలేని రుణం ఇచ్చిందని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇందిరా క్రాంతి పథకం కింద మహిళలకు బీఆర్ఎస్ వడ్డీలేని రుణాన్ని నిలిపివేసిందని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రైతులకు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ వంటి విషయాలేవీ కేటీఆర్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, మూడెకరాల భూ పంపిణీ హామీలిచ్చి ప్రజలను మోసం చేయట్లేదన్నారు.

**హక్కులను కాపాడాలి : బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తలసాని శ్రీనివాస్‌యాదవ్**
స్పీకర్ అందరి హక్కులను కాపాడాలనీ, అధికార పక్షం వైపు ఉండొద్దని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. అధికార పక్షం నుంచి గంటన్నరకుపైగా బాలూనాయక్, ఆది శ్రీనివాస్ మాట్లాడితే తాము సైలెంట్‌గా వింటూ నోట్ చేసుకున్నామన్నారు. ఇప్పుడు తమకు మాట్లాడే అవకాశం వచ్చిందనీ, మధ్యలో మంత్రులు జోక్యం చేసుకోవడం సభా మర్యాద కాదని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలుంటే మంత్రులుగానీ, డిప్యూటీ సీఎంగానీ, సీఎంగానీ రిప్లరు ఇచ్చే సమయంలో మాట్లాడాలని సూచించారు. తమ హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



# వివేకపు పొలిమేరల్లోనే...
# కోపానికి తావు

మానవ సహజాతాల్లో అత్యంత శక్తివంతమైనది, అంతే వేగంగా అనర్థాలను తెచ్చిపెట్టేది కోపం ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో లేదా నిట్టనిలువునా కూల్చివేయడంలో దీని పాత్ర అమోఘం. అందుకే పురాణాలు 'క్రోధం'ను అరిషడ్వర్గాలలో ఒకటిగా పేర్కొన్నాయి. అయితే, నేటి యాంత్రిక జీవనంలో, ఒత్తిడి పెరిగిన కాలంలో కోపం అసలు ఉండకూడదా? లేక అది అవసరమా? అనే ప్రశ్నపై లోతైన విశ్లేషణ అవసరం.

### హద్దు దాటితే అనర్థమే

కోపం అనేది ఒక క్షణికావేశం. అది విచక్షణను మింగేస్తుంది. కోపము పాపమునకు మూలము అన్న పెద్దల మాట అక్షర సత్యం. తీవ్రమైన ఆగ్రహం వల్ల రక్తపోటు పెరగడం, గుండె సంబంధిత సమస్యలు రావడం వంటి శారీరక నష్టాలే కాకుండా, అప్పటివరకు ఎంతో కష్టపడి నిర్మించుకున్న బంధాలు ఒక్క క్షణంలో తునాతునకలవుతాయి. అనవసరమైన ఆవేశం వల్ల తీసుకునే నిర్ణయాలు జీవితకాలం పశ్చాత్తాపానికి గురిచేస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే, కోపంలో ఉన్న మనిషి తన మేధస్సును తానే బంధించుకున్న ఖైదీతో సమానం. ఒక ఆయుధం

అయితే, అసలు కోపమే లేకపోవడం కూడా కొన్నిసార్లు బలహీనతగా మారుతుంది. లోక కల్యాణం కోసం, అన్యాయాన్ని ఎదిరించడం కోసం

వచ్చే కోపం ధర్మ ఆగ్రహం. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూసి రగిలిపోని మనసు మృతప్రాయం. ఆ కోపమే విప్లవాలకు, సంస్కరణలకు నాంది పలుకుతుంది.

క్రమశిక్షణ: ఒక ఉపాధ్యాయుడు విద్యార్థిని సరైన మార్గంలో పెట్టడానికి, ఒక తండ్రి బిడ్డను హెచ్చరించడానికి ప్రదర్శించే నటనాత్మక కోపం వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.

ఎవరైనా మన ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నప్పుడు లేదా సరిహద్దులు దాటుతున్నప్పుడు, మన నిరసనను వ్యక్తం చేయడానికి కోపం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది.

### నియంత్రణే అసలైన విజయం

కోపం రావడం తప్పు కాదు, కానీ అది మన నియంత్రణలో ఉండాలి. కత్తిని పట్టుకోవడంలో నేర్పు ఉంటే అది రక్షిస్తుంది, లేదంటే గాయపరుస్తుంది. కోపాన్ని అణచిపెట్టడం కంటే, దాన్ని సరైన దిశలో మళ్ళించడం ముఖ్యంగా ఆవేశం వచ్చినప్పుడు మౌనంగా ఉండటం, లోతైన శ్వాస తీసుకోవడం లేదా ఆ స్థలం నుంచి తప్పుకోవడం వంటి చిన్న మార్పులు పెద్ద ప్రమాదాలను తప్పిస్తాయి.

కోపం అనేది వంట గదిలో మండుతున్న పొయ్యి లాంటిది. అది హద్దుల్లో ఉంటేనే జీవితం రుచికరంగా ఉంటుంది. అది గడప దాటి ఇల్లంతా వ్యాపిస్తే సర్వనాశనమే. విజ్ఞతతో కూడిన నిరసన, వివేకంతో కూడిన ఆగ్రహం మాత్రమే వ్యక్తికి, సమాజానికి శ్రేయస్కరం. కోపమును జయించినవాడే అసలైన వీరుడు అన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103

## ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్న రైతులు

### కొత్తపల్లి రైతు వేదికలో అవగాహన కార్యక్రమం





**భీమదేవరపల్లి/మార్చి17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి రైతు వేదికలో మంగళవారం సహజ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రామ్‌లో భాగంగా రైతులను ప్రోత్సహించేందుకు 125 మంది రైతులకు ఎన్ఎంఎన్ఎఫ్ కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి పద్మ ఆధ్వర్యంలో సర్పంచులు మేకల వెంకన్న, సికె ప్రదీప్ రైతులకు కిట్లను అందజేశారు. ఈ కిట్లలో క్యాప్, పెన్, నోట్‌బుక్, ఐడి కార్డు, క్లాత్ బ్యాగ్, క్యాలెండర్ వంటి వస్తువులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఈవో క్రిసొలైట్, కృషి సఖీ మంద సుజాత, కొట్ట రేణుకతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మల్లారంలో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం





**భీమదేవరపల్లి/మార్చి17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలోని శ్రీ తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రసాద్ పంతులు ఆధ్వర్యంలో 108 కలశాలతో మహా యజ్ఞం నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. శుభ ముహూర్తంలో వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ తాపాల లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు గ్రామస్థులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కోరిన కోరికలు తీర్చే లక్ష్మీనరసింహస్వామి దర్శనం పొందడం మహాభాగ్యంగా భావిస్తూ భక్తజనులు ఆనందం వ్యక్తం చేశారు. పురాతన కాలానికి చెందిన ఈ ఆలయంలో నిర్వహించిన ఈ మహోత్సవం భక్తి శ్రద్ధలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడెల్లి కల్పన తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది శివకుమార్, వైస్ చైర్మన్ బర్రె రమణారెడ్డి, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, మాజీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, శ్రీ హరిహర భక్తజనుల కళాబృందం, ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంటల మెరుగుదలపై జాతీయ సదస్సు

## శాస్త్రీయ పరిశోధనలే వ్యవసాయానికి దిక్సూచి: నిపుణులు





**నర్సంపేట/ మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రూసా (పీఎం ఉష) సహకారంతో "ప్లాంట్ సైన్స్‌లో తాజా పురోగతులు పంటల మెరుగుదలలో సమస్యలు, సవాళ్లు" అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరై శాస్త్రీయ అంశాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు.

జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శాస్త్రీయ అవగాహన రైతులకు చేరినప్పుడే దాని అసలు ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. పంటలలో వైవిధ్యం లేకపోవడం రైతులకు నష్టంగా మారుతోందని, కొత్త వంగడాల అభివృద్ధి, పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక వృక్షశాస్త్రం వ్యవసాయాభివృద్ధికి మార్గదర్శక శక్తిగా నిలుస్తోందన్నారు. పంటల దిగుబడి పెంపు, రోగనిరోధక రకాల అభివృద్ధి, ఆహార భద్రత సాధనలో పరిశోధనాత్మక దృక్పథం అవసరమని చెప్పారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. మల్లం నవీన్ అధ్యక్ష ప్రసంగంలో వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాల్లో వృక్షశాస్త్ర పరిశోధనలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. విద్యార్థులు తరగతి గదులకు పరిమితం కాకుండా సెమినార్లు, పరిశోధన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

ముఖ్య వక్త ప్రొ. ఎన్. రామస్వామి వృక్షశాస్త్రంలో బయోటెక్నాలజీ పాత్ర, అణు స్థాయి పరిశోధనలు, భవిష్యత్తు ఆహార అవసరాలపై వివరించారు. ప్రొ. ఎం.డి. ముస్తఫా అనువర్తిత పరిశోధనలకు ప్రాధాన్యత అవసరమని పేర్కొన్నారు.

సదస్సులో ప్రొ. బత్తిని చంద్రమౌళి, ప్రొ. జి. పోచయ్య, డా. మోహన్ బెహరా, డా. ముకుందరాజ్ బాబురావు పాటిల్, డా. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సు కన్వీనర్ డా. ఎం. రాంబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని శాస్త్రీయ ఆలోచనలను పంచుకోవడం సదస్సు విజయాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

# గ్రామాభివృద్ధికి పరస్పర గౌరవం కీలకం

### మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్



**భీమదేవరపల్లి/మార్చి17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చిన్నచూపు చూస్తున్నారని మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు తాళ్ల అరవింద్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో జరిగే సమావేశాల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సరైన గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సమావేశాలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇకపై గ్రామాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలు కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు పరస్పర గౌరవంతో, సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం - మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..





**/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త్:,(హైదరాబాద్):** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన డొంకెన స్వప్న

### సన్మానించిన మాజీ మార్కెట్ చైర్పర్సన్ అక్కెనె పెల్లి స్వర్ణలత బాలరాజు



**స్టేషన్ ఘన్పూర్/మార్చి 16 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ తాహసిల్దార్ గా డొంకెన స్వప్న సోమవారం రోజున మండల తాహసిల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఉత్సవం అందజేసి స్వాగతించారు. ఇటీవల బదిలీపైవచ్చిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జిల్లాలోని తహసీదారులను బదిలీ చేసిన క్రమంలో ఇక్కడ పని చేసిన తాసిల్దార్ వెంకటేశ్వర్లు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయగా, కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డి స్వప్న ను ఘన్పూర్ తాహ సిల్దార్ కార్యాలయానికి తాహసిల్దార్ గా బది లీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం తాహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన డొంకెనా స్వప్న మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షే మ పథకాలు అన్ని అర్హులైన లబ్ధిదారులకు అందెల గుర్తు చేస్తానని , ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాహసిల్దార్ డొంకెన స్వప్నను మాజీ మార్కెట్ చైర్మన్ అక్కెనపల్లి స్వర్ణలత బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ప్రాణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానభాగ మనోహర్, లునావత్ జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్

### నిందితుల నుంచి రూ.77 లక్షల రికవరీ



**హైదరాబాద్,/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** కూకట్‌పల్లి ప్రాంతంలో జరిగిన భారీ దోపిడీ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.77 లక్షల రికవరీ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. కూకట్?పల్లిలో ఖుస్రు, అజిముద్దీన్ అనే వ్యక్తులు కోటి రూపాయల నగదును తీసుకుని వెళ్తుండగా వారిపై గుర్తు తెలియని నలుగురు దుండగులు దాడి చేశారు. కళ్లలో కారం చల్లి, వారి వద్ద ఉన్న కోటి రూపాయల నగదును తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా రూ.1 కోటితో పరారైన నలుగురు దుండగుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607 తెలుగు దిన పత్రిక

## స్వామివారికి ఘనంగా
# అష్టదళ పాద పద్మారాధన పూజ




**స్టేషన్ ఘన్పూర్/మార్చి 17(జర్నలిస్ట్ వార్త)** :చిల్పూర్ మండలకేంద్రంలో చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం పుర స్కరించుకొని కార్యనిర్వాహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి అష్టదళ పాద పద్మారాధ న పూజ బంగారు పద్మాలతో అంగరంగ వైభవంగా అర్చకులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దేవాలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు- కిరణ్మయి దంపతులు 516 రూపాయలు చెల్లించి అష్టదళ పాద పద్మారా ధన సేవలో పాల్గొని పూజ జరిపిం చుకున్నా రు. వివిధ గ్రామాల నుండి,పట్టణాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివా రిని దర్శించుకున్నారు. గుడ్తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ కే మోహన్, ప్రధాన అర్చకుడు బి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు రికార్డు అసిస్టెంట్ వీరన్న, ఆలయ సిబ్బంది విశాల్, రాజశేఖర్,మహేష్, కృష్ణ ఆలయ ధర్మకర్తలమండలిసభ్యులుతదితరులు పాల్గొ న్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
### .నియోజకవర్గ ఇన్చార్జ్ సింగపురం ఇందిరా




**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ఘన్పూర్ పట్టణంతోపాటు, అన్ని గ్రామా ల్లో ప్రజలకు కార్యకర్తలకు ఎలాంటి కష్టాలు వచ్చిన వారికి అండగా ఉండి తమకు సాధ్య మైన సహాయం చేస్తామని కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిరా అన్నారు. మృతుల కుటుంబాలను ఫోన్లో పలకరించి ఓదార్చరు.మండలం ఎస్సీకాలనీ వాస్తవ్యులు మాతంగి నరసయ్య, రడపాక కొమురయ్య, ఇటీవల మృతి చెందడం జరిగింది. వియం యం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన పూర్ నియోజకవర్గ ఇన్చార్జి సింగపురం ఇందిర కుమారుడు యువ నాయకులుసింగ పురం ఇమ్మానుయేల్ రాజ్ సోమవారం ఇటీ వల మృతి చెందిన కుటుంబాలను పరామ ర్శించి ఒక్కో కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలోవారితోపాటు జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సింగపురం నాగయ్య ,మాజీ ఉపస ర్పంచ్ సింగపురం వెంకటయ్య , సీనియర్ నాయకులు తాటికొండ సంపత్, గుర్రం సమ్మ య్య, మాతంగి అశోక్, కండక్టర్, లింగయ్య సునీత, తదితరులు పరామర్శించారు.

# రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన గంగుల మనోరంజన్ రెడ్డి



**స్టేషన్ ఘన్పూర్/మార్చి17 ( జర్నలిస్ట్ వార్త):** ఇటీవాళ నూతనంగా రాజ్యసభ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సోమవారం సివిల్ కాంట్రాక్టర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు గంగుల మనోరం జన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మిత్రుడు.సీఎం సలహాదారుడు,అయినటువంటి నాయకుడు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఏకగ్రీవం గా ఎన్నికైన శ్రీ వేం నరేందర్ రెడ్డిని వారి నివా సంలోమర్యాదపూర్వకంగా కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపిన కొత్తపల్లి గ్రామ నివాసంఅయినటువంటి సివిల్ కాంట్రా క్టర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రెడ్డి వేం నరేందర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడై నందు వల్ల సన్మానించడం జరిగిందని గంగు ల మనోరంజన్ తెలిపారు.

# ఎస్సీ కార్పొరేషన్ పథకాలకు గడువు
### మార్చి 25లోపు హార్డ్ కాపీలు సమర్పించాలి: ఈడీ నవీన్ బాబు

**ఖమ్మం బ్యూరో/ మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**202526 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి పథకాల కోసం నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు మార్చి 24లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు సూచించారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలను జతచేసి, దరఖాస్తుల హార్డ్ కాపీలను మార్చి 25లోపు కలెక్టరేట్లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.నిరుద్యోగ ఎస్సీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నదని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణకు నామ నివాళి



**తల్లాడ /మార్చి17(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ మోరంపూడి సత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన సత్యనారాయణ స్వగృహానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.అనంతరం సత్యనారాయణ సోదరుడు మోరంపూడి ప్రసాద్రావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరు జీవన్కుమార్, తల్లాడ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, దుగ్గిదేవర అజయ్, నాయుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కనకయ్య, శెట్టిపల్లి లక్ష్మణరావు, వెంకటరెడ్డి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిలోకేష్ ను కలిసిన ఖమ్మం బిషప్



**ఖమ్మం/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను ఖమ్మం జిల్లా బిషప్ సగిలి ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, సామాజిక అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం బిషప్ సగిలి ప్రకాష్, మంత్రి లోకేష్కు ఫోటోతో కూడిన ప్రత్యేక ఫైలును జ్ఞాపకంగా బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బిషప్ వెంట పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


# టాపర్ బాలికలకు సైకిళ్లు
### ఎస్బిఐ సిఎస్ఆర్ తో ప్రోత్సాహం




**వేలేరు /హనుమకొండ బ్యూరో మార్చి 17(జర్నలిస్ట్ వార్త)**:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్బిఐ శాఖ సిఎస్ఆర్ నిధులతో క్లాస్ టాపర్ బాలికలకు సైకిళ్లు, కిట్లు పంపిణీ చేశారు. 6వ నుండి 9వ తరగతి వరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ఈ సదుపాయం పొందారు.మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మీ బిల్లా యాదగిరి, ఎస్బిఐ మేనేజర్ కుమారస్వామి చేతుల మీదుగా సైకిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 480 పాఠశాలల్లో 10 పాఠశాలలను మాత్రమే ఎంపిక చేయగా, అందులో వేలేరు పాఠశాల చోటు దక్కడం విశేషమన్నారు. ఇందుకు బ్యాంకు మేనేజర్ కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధిస్తే ఇలాంటి ప్రోత్సాహకాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారికే సీసీ రోడ్డు కావాలి
### ఇంటర్నల్ పనులపై కాలనీ వాసుల ఆగ్రహం




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 17(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మోడల్ కాలనీని ప్రధాన రహదారితో కలిపే సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కె. అనిల్కుమార్కు వినతిపత్రం సమర్పించారు.

కాలనీలో ఇంటర్నల్ రోడ్లకు సీసీ వేయాలని గ్రామపంచాయతీ ప్రతిపాదనలు చేయడం, ప్రజలకు సమాచారం ఇవ్వకుండా పనులకు సిద్ధమవడం సరికాదని మండిపడ్డారు. కేవలం 56 ఇళ్లకు మాత్రమే ఉపయోగపడే ఇంటర్నల్ రోడ్డుకు ప్రాధాన్యం ఇవ్వడం అన్యాయమని విమర్శించారు.

ప్రధాన రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా చేరుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. విద్యార్థులు బస్సు ఎక్కడానికి దూరం నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి స్వలాభం కోసం మొత్తం కాలనీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

ఎంపీడీవో అనిల్కుమార్ స్పందిస్తూ సమస్యను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బోడగుట్ట దోపిడీపై మౌనం
# బాధ్యత ఎవరిది?
### మైనింగ్ మాఫియా అల్లర్లు- గ్రామానికి నష్టం, అధికారుల నిర్లక్ష్యం!





**ఎల్కతుర్తి/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని దామెర గ్రామంలో బోడగుట్ట మైనింగ్ వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. గ్రామానికి ప్రధాన సహజ వనరుగా ఉన్న బోడగుట్టను మైనింగ్ పేరుతో దోచుకుంటున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం మౌనం వహించడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.ఏళ్లుగా గ్రామ ప్రజల జీవనాధారంగా ఉన్న గుట్టను కొందరు కాంట్రాక్టర్లు లీజుల పేరుతో విచ్చలవిడిగా తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బ్లాస్టింగ్ల కారణంగా ఇళ్లు పగుళ్లు పడటం, రహదారులు దెబ్బతినడం వంటి సమస్యలు రోజువారీగా మారాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తమవుతోంది.క్రషర్ ఏర్పాటుకు ముందు రాయి కొట్టుకుని జీవనం సాగించిన వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బ్లాస్టింగ్లతో అడవి జంతువులు గ్రామాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పర్యావరణ నిబంధనలు పాటించకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు చర్యలు తీసుకోకపోవడం అనుమానాస్పదంగా ఉందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.ఇక గ్రామ పంచాయతీ పాలకవర్గం పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మైనింగ్ అంశంపై అధికారులతో చర్చించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని స్థానికులు చెబుతున్నారు. గుట్ట లోతు, తవ్వకాల పరిమితి వంటి అంశాలను పరిశీలించకుండా మౌనం వహించడం వెనుక కారణాలేమిటన్నది ప్రశ్నగా మారింది.

కొంతమంది స్థానిక నాయకులు క్రషర్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి రావాల్సిన ఆదాయంపై కూడా ప్రభావం పడుతున్నట్లు సమాచారం.ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సంపదను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఇల్లు సమాజం మనసు

# మూడు మాటలు, ఒక జీవితం!

జీవితం అంటే ఏమిటి? ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తుంది? ఈ ప్రశ్నలకు పెద్ద పెద్ద తత్వవేత్తలు చెప్పిన సమాధానాల కంటే, మన రోజువారీ జీవితంలో కనిపించే చిన్న చిన్న నిజాలే గొప్పవిగా నిలుస్తాయి.ఒక ఇల్లు బాగుండాలంటే బాధ్యత గల తండ్రి ఉండాలిఒ ఒక సమాజం బాగుండాలంటే బలమైన నాయకుడు ఉండాలిఒ మనసు బాగుండాలంటే మంచి స్నేహితులు ఉండాలి" ఈ మూడు వాక్యాలు జీవితం అనే పుస్తకానికి మూడు అధ్యాయాలు.



### ఇల్లు -జీవితం మొదలయ్యే చోటు

ఇల్లు అనేది కేవలం ఇటుకలు, సిమెంట్ కాదు. అది భావోద్వేగాల గూటి. అక్కడ నవ్వులు, కన్నీళ్లు, ఆశలు, కలలుఖిశ్రీశ్రీ కలిసి ఒక కథలా సాగుతాయి.

ఈ కథకు దారి చూపించే వ్యక్తి తండ్రి. బాధ్యత గల తండ్రి ఉంటే ఆ ఇంట్లో గందరగోళం ఉండదు, గౌరవం ఉంటుంది. మాటల కంటే పనులతో పిల్లలకు జీవితం నేర్పించే గురువు అతనే.చాలాసార్లు తండ్రి ప్రేమ బయటపడదు. కానీ ప్రతి కష్టం వెనుక అతని నిశ్శబ్ద పోరాటం ఉంటుంది. పిల్లల భవిష్యత్తు కోసం తన కోరికలను త్యాగం చేసే మనిషి తండ్రి. అలాంటి బాధ్యత గల వ్యక్తి ఉంటే, ఆ ఇల్లు ఎప్పుడూ నిలకడగా ఉంటుంది.

### సమాజం- మన అందరి ప్రతిబింబం

ఒక సమాజం ఎలా ఉంటుంది అంటే, అక్కడి నాయకత్వాన్ని చూసి చెప్పొచ్చు. నాయకుడు అంటే అధికారంలో ఉన్నవాడు కాదుప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నవాడు.బలమైన నాయకుడు ఉంటే సమస్యలు సవాళ్లుగా మారతాయి; బలహీన నాయకుడు ఉంటే సవాళ్లు సమస్యలుగా మారిపోతాయి.మన చుట్టూ చూస్తే ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. ఎక్కడ నాయకుడు ప్రజలతో కలిసి నడుస్తాడో, అక్కడ అభివృద్ధి ఉంటుంది. ఎక్కడ నాయకుడు మాటల్లోనే ఉంటాడో, అక్కడ నిరాశ ఉంటుంది.కాబట్టి సమాజం బాగుండాలంటే నాయకుడు నిబద్ధతతో, న్యాయంతో ముందుకు నడవాలి.

### మనసు- కనిపించని ప్రపంచం

మనసు కనిపించదు కానీ మన జీవితాన్ని నడిపేది అదే. ఆ మనసు ప్రశాంతంగా ఉండాలంటే మనకు మంచి స్నేహితులు అవసరం.స్నేహం అనేది రక్త సంబంధం కాదు, హృదయ సంబంధం. మన మాటలు చెప్పకుండానే అర్థం చేసుకునే వ్యక్తి స్నేహితుడు.ఇప్పుడు కాలం మారింది. వేల మంది ఫ్రెండ్స్ లిస్టులో ఉన్నా, మన బాధ చెప్పుకునే వ్యక్తి లేకపోతే మనసు ఒంటరిగా మారుతుంది.

నిజమైన స్నేహితుడు మన విజయాల్లో కంటే, మన వైఫల్యాల్లో ఎక్కువగా కనిపిస్తాడు. మన తప్పులను అంగీకరింపజేసి, సరిదిద్దే వ్యక్తి నిజమైన స్నేహితుడు.

### మూడు బంధాలు-మూడు బలాలు

ఇల్లు మన పునాదిసమాజం మన పరిధి మనసు మన అసలు ప్రపంచంఈ మూడు బాగుంటే జీవితం అందంగా ఉంటుంది. ఒకటి బలహీనమైతే జీవితం అసమతౌల్యంగా మారుతుంది.బాధ్యత గల తండ్రి కుటుంబాన్ని నిలబెడతాడు.బలమైన నాయకుడు సమాజాన్ని ముందుకు తీసుకెళ్తాడు.మంచి స్నేహితుడు మనసుకు అండగా నిలుస్తాడు.

మనందరం ఒకేసారి తండ్రులం కాకపోవచ్చు, నాయకులం కాకపోవచ్చు. కానీ మంచి మనుషులం కావచ్చు.మన కుటుంబంలో బాధ్యత తీసుకుంటే మనమే తండ్రి లాంటి వారు అవుతాం.

మన చుట్టూ ఉన్నవారికి దారి చూపిస్తే మనమే నాయకులం అవుతాం. మనస్ఫూర్తిగా తోడుగా ఉంటే మనమే మంచి స్నేహితులం అవుతాం.

జీవితం గొప్పది కావాలంటే పెద్ద విజయాలు అవసరం లేదుఒచిన్న చిన్న బంధాలను గొప్పగా నిలబెట్టడమే చాలు!



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే లెనిన్ సుధాకర్
-9908401581

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

## ధర్మసాగర్, వేలేరు మండలాల్లో బీజేపీ వినతిపత్రాలు- నిరసనలు






**ధర్మసాగర్/వేలేరు, మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు రెండు మండలాల్లో వినతిపత్రాలు సమర్పించాయి.

ధర్మసాగర్ మండలంలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ ఆధ్వర్యంలో ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూడ హామీల అమలులో ప్రభుత్వం ఆలస్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కథుగయ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి సాయం సందీప్, ఉపాధ్యక్షుడు మోర్ రాజేందర్, బీజేవైఎం అధ్యక్షుడు గాజా శ్యాంసుందర్, ఓబీసీ అధ్యక్షుడు మాచర్ల అనిరుధ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెసరు వెంకటేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంగారపు రమేష్, సీనియర్ నాయకులు దుస్సా రాములు, సాంబరాజు, శ్రీధర్, సంపత్, వెంకన్న, గట్టుమళ్ళ తదితరులు పాల్గొన్నారు.ఇక వేలేరు మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు కాత్రేవుల రాజు యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఇంచార్జి పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి హాజరయ్యారు.

అమరేందర్ రెడ్డి మాట్లాడుతూడ ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించాలని, కళ్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయం, బంగారం అందించాలని కోరారు.

హామీలు అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీతా దుర్గాప్రసాద్, కీర్తి సురేశ్, లోనే శివాజీ, రుద్రోజు కిరణ్, మురావత్ రాజు, రాహుల్, రమేశ్ రామ్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాలు ఏకమవ్వాలి

## కేంద్ర విధానాలపై పోరాటం తప్పదని హెచ్చరిక





**ధర్మసాగర్ /మడికొండ,/హనుమకొండ బ్యూరో మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):**భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో మడికొండలో కార్మిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రమ శక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి, రాష్ట్ర కార్యదర్శి రసమల్ల కొమురయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పానుగంటి కాలేబు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూడ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు అన్ని కార్మిక సంఘాలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. కార్మికులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక సంక్షేమానికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు.

దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ధర్నాలు, భారత్ బంద్‌కు పిలుపునిచ్చినా సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1930 దశకంనుంచి అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన కార్మిక చట్టాలను ఇప్పటి కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక లోకానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు.ఇప్పటికైనా అన్ని సంఘాలు కలసి కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో సంఘాలను బలోపేతం చేసి కార్మిక హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని సూచించారు.ఈ నెల 30న జనగామలోని జూబ్లీ ఫంక్షన్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సలహాదారు నాయిని రామస్వామి, రాష్ట్ర నాయకులు అలువల ఎల్లయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నాగిళ్ల రాజు, దామెర బాలనర్సయ్య, జిల్లా కార్యదర్శులు నిర్మల సత్యం, పోకల శ్రీనివాస్ (సర్పంచ్), జారిపోతుల రాజు (సర్పంచ్), రొడ్డ రాజు, తాండ్ర రాములు, బాధింటి బాబు, తిప్పరపు రామచంద్రం, ఉడుగుల యాదగిరి, గాదె అశోక్, నిరడి వీరస్వామి, తిప్పరపు ఉప్పలయ్య, కుంతి రామనార్సయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

## తహసీల్దార్‌కు బీజేపీ వినతి పత్రం



**ఎల్కతుర్తి/ మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎల్కతుర్తి మండల శాఖ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూడ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు ఎకరాకు రూ.6,000 పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి మాట మార్చారని అన్నారు.రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారని, మండలంలో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళలకు ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదని, వెంటనే దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని కోరారు.పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో సమర్పించిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జనగాం కిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, చిదూరల వెంకటేష్, పల్లెపాటి మధుకర్, బీట్ల లింగయ్య, కోడం రమేష్, ఠాకూర్ శంసింగ్, వంగ రమేష్, కొలిపాక శ్రీనివాస్, కనుకుంట్ల రమణాచారి, మాట్ల విద్యాసాగర్, సూది రెడ్డి సాయికృష్ణ, దాసరి సాయి తేజ, సప్పిరాజు, చిర్ర శ్రీనివాస్, పోలు శివ, నాంపల్లి విష్ణువర్ధన్, నన్నబోయిన సంపత్, హింగే దేవరావు, తక్కాలపల్లి సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడులు

## ఐదు టిఫిన్ సెంటర్లపై దాడులు.. 15 డొమెస్టిక్ సిలిండర్లు సీజ్



**వర్ధన్నపేట/మార్చి 17(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా గృహ అవసరాలకు వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాల కోసం వాడుతున్నారన్న సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ఐదు టిఫిన్ సెంటర్లలో సోదాలు నిర్వహించగా, అక్కడ వాడుతున్న 15 డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారి మాట్లాడుతూ గృహ అవసరాల కోసం ప్రభుత్వం ఇచ్చే రాయితీ సిలిండర్లను హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అక్రమంగా సిలిండర్లను నిల్వ చేసినా, కమర్షియల్ గా వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్ఐ సాయి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులను హెచ్చరించారు.

# కొత్తపేట గ్రామపంచాయతీలో మంచినీటి సమస్యలకు చెక్.



**బయ్యారం/మార్చి 17.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో ఎస్సి కాలనీవాసుల కొంతకాలంగా ఎదుర్కొంటున్న మంచినీటి ఇబ్బందులను గమనించిన సర్పంచ్ ప్రవీణ్ నాయక్ వెంటనే స్పందించి బోర్ వెల్ కు కొత్త మోటర్ ఏర్పాటు చేసి గ్రామస్తుల నీటి సమస్యలకు చెక్ పెట్టారు.ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పలు కాలనీల్లో నీటి సమస్యలను పరిష్కరిస్తూ అందరికీ అండగా నిలుస్తున్న సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ పలువురు సర్పంచ్ లకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మూడు నాగమ్మ బోర్ వెల్ మోటర్ స్విచ్ ఆన్ చేసి ఓపెనింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి వీరభద్రరావు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతినీ సన్మానించిన జిల్లా ఎస్పీ.



**బయ్యారం/మార్చి17.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం జగ్గుతండా గ్రామంలో శాంతి భద్రతలపై గ్రామ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ మంచి అవగాహనతో పని చేస్తూ గ్రామాన్ని సీసీ కెమెరా ఏర్పాటు చేసి గ్రామాన్ని భద్రతపరంగా ముందుకు తీసుకెళ్తున్న తీరును అభినందిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పి డా.శబరిష్ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణను ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగ్గుతండ సర్పంచ్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పంచాయతీలో శాంతి భద్రతలు కాపాడడంలో అవి ఎంతో దోహదం చేస్తాయని అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ జిల్లా పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి తిరుపతి రావు,గార్ల బయ్యారం సీఐ రవీందర్,ఎస్ఐ తిరుపతి,వివిధ గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
బుధవారం18 మార్చి 2026

# నేలమట్టమైన మొక్కజొన్నడ రైతుల విలవిల

## ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

**ఎల్కతుర్తి/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని దామెర, గోపాల్పూర్ తదితర గ్రామాలలో చేతికొచ్చిన మొక్కజొన్న పంట బలమైన గాలులకు నేలమట్టమై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వీచిన ఈదురుగాలులతో పండిన పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వారు తెలిపారు.దామెర గ్రామానికి చెందిన కొమ్మిడి అన్నారెడ్డి, సంఘ కుమార్, మంతుర్తి రాజయ్య, పిప్పాల బిక్షపతి, ఒద్దుల శ్రీనివాస్ తదితర



రైతుల పొలాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలమట్టమైంది. సుమారు 30 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్లు రైతులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతు పిప్పాల బిక్షపతి మాట్లాడుతూడ మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు సిద్ధమైన సమయంలోనే గాలులకు నేలమట్టం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# టీడీపీకి తీరని లోటు

## గంజి నారాయణకు ఘన నివాళులు

**మధిర/ మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గంజి నారాయణ (99) మంగళవారం రాత్రి 11 గంటలకు మధిరలోని ప్రకాశం రోడ్‌లో ఉన్న తన స్వగృహంలో వయోభార సమస్యలతో కన్నుమూశారు.పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీకి విశేష సేవలు అందించిన ఆయన, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. రైతుల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. వృద్ధాప్యంలోనూ బాధ్యత గల పౌరునిగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వీల్‌చైర్‌లో పోలింగ్ బూత్‌కి చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం.ఆయన పార్థివదేహంపై టీడీపీ జెండా కప్పి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర మాజీ నాయకుడు చేకూరి శేఖర్ బాబు నివాళులు



అర్పించారు. అనంతరం డాక్టర్ రామనాథం, రత్నమాణిక్యం దంపతులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామనాథం మాట్లాడుతూడ గంజి నారాయణ మృతి టీడీపీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ తరపున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు వంకాయలపాటి వెంకటనాగేశ్వరరావు (బాబు), ములకలపల్లి వినయ్, బోడేపూడి పార్వతి, అలాగే టీడీపీ నాయకులు వంగాల రామకోటి, గద్దల ప్రకాశరావు, రావి కోటేశ్వరరావు, వట్టికొండ నాగేశ్వరరావు, వేమూరి సునీల్, యలమంచిలి శివ, చెరుకూరి కృష్ణారావు, మేడా వెంకటేశ్వరరావు, గడ్డం రమేష్, మార్నీడి పుల్లారావు, మల్లాది హనుమంతరావు, సట్టు వెంకటేశ్వర్లు తదితరులు పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు.అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు దేవిశెట్టి రంగారావుతో పాటు పలువురు నేతలు కూడా నివాళులు అర్పించారు

# హామీలు అమలు చేయాలి

## - తహసీల్దార్‌కు బీజేపీ మెమొరాండం



**వేంసూర్/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు వేంసూర్ తహసీల్దార్‌కు మంగళవారం మెమొరాండం సమర్పించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజురామచంద్రరావు ఆదేశాలు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపు మేరకు మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకరరెడ్డి అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి నాగ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూడ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. బూటకపు హామీలతో పరిపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించారు.ఇచ్చిన హామీల్లో భాగంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను రూ.4 వేలుగా పెంచాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళు మంజూరు చేయాలని, ఉచిత విద్యుత్ అందించాలని, గ్యాస్ సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే ఆడపిల్లల పెళ్లికానుకగా తులం బంగారం, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.2,000 ఆర్థిక సాయం హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు భీమిరెడ్డి బాలకృష్ణరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాధిరాజు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బండి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు కొప్పుల మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కిన్నెర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రామపంచాయతీలో మంచినీటి సమస్యలకు చెక్.

**బయ్యారం/మార్చి 17.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీలో ఎస్సి కాలనీవాసుల కొంతకాలంగా ఎదుర్కొంటున్న మంచినీటి ఇబ్బందులను గమనించిన సర్పంచ్ ప్రవీణ్ నాయక్ వెంటనే స్పందించి బోర్ వెల్ కు కొత్త మోటర్ ఏర్పాటు చేసి గ్రామస్తుల నీటి సమస్యలకు చెక్ పెట్టారు.ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పలు కాలనీల్లో నీటి సమస్యలను పరిష్కరిస్తూ అందరికీ అండగా నిలుస్తున్న సర్పంచ్



భూక్యా ప్రవీణ్ నాయక్ పలువురు సర్పంచ్ లకు ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మూడు నాగమ్మ బోర్ వెల్ మోటర్ స్విచ్ ఆన్ చేసి ఓపెనింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి వీరభద్రరావు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా

# ఎంపీపీఎస్ ఉయ్యాలబాడవ రికార్డు

## సదుపాయాలు లేక ఇబ్బందులు- అధికారులు స్పందించాలన్న గ్రామస్తులు





**భద్రాద్రి కొత్తగూడెం/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీఎస్ ఉయ్యాలబాడవ పాఠశాల మారుమూల ఆదివాసి గిరిజన గ్రామంలో ఉన్నప్పటికీ కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా విద్యను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.పాఠశాలలో మొత్తం 20 మంది విద్యార్థులు ఉండగా, డ్రాప్‌ఔట్స్ లేకపోవడం, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పరిస్థితి లేకపోవడం విశేషం. గత విద్యాసంవత్సరం 20242025లో అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రవేశపెట్టిన "బాలమేళా1.0" కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు పాయం ఆనందరావు, ఉపాధ్యాయులు బానోత్ రాములు నాయక్ ఆధ్వర్యంలో పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.పాఠశాలలోనే నవోదయ, గురుకుల, ఏకలవ్య ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందిస్తూ, ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించడం ద్వారా ఈ పాఠశాల మండలంలోనే మేటిగా నిలుస్తోంది. 20242025 విద్యాసంవత్సరంలో ఎఫ్ఎల్ఎన్ బాలమేళా జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డును అందుకోగా, 20252026లో బాలమేళా2.0 పోటీల్లో కాంప్లెక్స్, మండల స్థాయిల్లోనూ ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా డీఈవో నాగలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.పాఠశాల ప్రత్యేకతల విషయానికి వస్తేడ 2వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్‌లో 100 శాతం చదవడం, రాయడం చేయగలుగుతున్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు సులభంగా చేయడమే కాకుండా, దేశంలోని రాష్ట్రాలు, రాజధానులు, భాషలు, జిల్లామండలాల వివరాలు, వేమన నీతి పద్యాలు తాత్పర్యాలతో చెప్పగలుగుతున్నారు. అలాగే జనరల్ సైన్స్, ప్రభుత్వ అధికారుల వివరాలను కూడా స్పష్టంగా తెలియజేస్తూ అధికారులను ఆశ్చర్యపరుస్తున్నారు.గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు. అయితే, ఇంత ప్రతిభ కనబరుస్తున్న ఈ పాఠశాలకు వంటగది, ప్రహరీ గోడ లేకపోవడం సమస్యగా మారింది. పశువులు పాఠశాల ప్రాంగణంలోకి రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.కావున వెంటనే వంటగది, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఉగాది సందేశం- సంకల్పాలకు శ్రీకారం

**సత్తుపల్లి/మార్చి 17 (జర్నలిస్ట్ వార్త):** భారతీయ సంస్కృతి గొప్పదని, ప్రతి పండుగ మన జీవితానికి విలువైన సందేశాన్ని అందిస్తుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది జీవితం లో ఎలాంటి






పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని సూచిస్తుందని పేర్కొన్నారు.మంగళవారం విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై పండుగకు ప్రత్యేక శోభను చేకూర్చారు. ఉగాది ప్రాముఖ్యతపై డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించి, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని అందించారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవితం లోని ఆనందం, ఆశ్చర్యం, ఆసక్తి, విజయం, అపజయం, బాధలను సూచిస్తాయని తెలిపారు. కష్టాలు కూడా జీవితంలో భాగమని, గొప్ప సంకల్పంతో వాటిని ఎదుర్కొంటూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

ప్రతిజ్ఞలు చేసిన విద్యార్థులుఉగాది సందర్భంగా విద్యార్థులు నూతన తీర్మానాలు చేశారు. ప్రతిరోజూ సమయానికి చదవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, పెద్దలను గౌరవించడం, మంచి పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు.ఉగాది కొత్త ఆశలు, కొత్త అవకాశాలను తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడి.

**బయ్యారం/మార్చి 17.(జర్నలిస్ట్ వార్త)** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలోయువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చీబ్ ఆదేశాల మేరకు తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పిలుపు మేరకు ఢిల్లీలోని ఇండియా యూఎస్ ట్రెడ్ డీల్,దేశంలోని రైతుల హక్కులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్ నుండి జంతర్ మంతర్ వరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా బయలుదేరి నిరసన కార్యక్రమాలు చేపట్టారు.పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో ఇల్లందు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్,కార్యకర్తలు కూడా పాల్గొని తమ నిరసన తెలియజేశారు.ఈ నిరసనల్లో భాగంగా నిరుద్యోగం,యువత సమస్యలపై జాతీయ



స్థాయిలో గళం విప్పారు.ఈ ఆందోళనల్లో భాగంగా యువజన కాంగ్రెస్ దేశవ్యాప్తంగా వచ్చిన నాయకులతో కలిసి నినాదాలు చేశారు.కేంద్ర ప్రభుత్వ విధానాలకు



వ్యతిరేకంగా,యువత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి యువజన కాంగ్రెస్ ప్రయత్నించింది.

# యూట్యూబ్ సింగర్‌కు ఉగాది పురస్కారం ప్రదానం

## 500 పాటల మైలురాయిని అధిగమించిన హనుమాండ్ల ప్రభాకర్

**వరంగల్ కల్చరల్/మార్చి 17(జర్నలిస్ట్ వార్త):** సంగీత రంగంలో తనదైన ముద్ర వేస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు పాటను విశ్వవ్యాప్తం చేస్తున్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగి, ప్రముఖ యూట్యూబ్ సింగర్ హనుమాండ్ల ప్రభాకర్ను ఉగాది పురస్కారం వరించింది. మంగళవారం స్థానిక పబ్లిక్ గార్డెన్స్‌లో జె.బి. కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక వేడుకల్లో ఆయనకు ఈ గౌరవం దక్కింది.



జె.బి. కల్చరల్ ఆర్ట్ సొసైటీ ప్రతినిధులు జడల శివ-సతిమణి దంపతుల సారథ్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభాకర్ ఇప్పటివరకు యూట్యూబ్ వేదికగా సుమారు 500కు పైగా గీతాలను ఆలపించి, లక్షలాది మంది శ్రోతల మన్ననలు పొందారు. ఆయన గాత్ర పటిమను, కళా సేవను గుర్తించిన సొసైటీ, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ వేదికపై ఆయనను శాలువాతో సత్కరించి, స్మారక చిహ్నాన్ని అందజేసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వృత్తిరీత్యా ఎక్సైజ్ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తూనే, ప్రవృత్తిగా సంగీతాన్ని నమ్ముకుని ప్రభాకర్ సాధించిన విజయం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ తనను గుర్తించి పురస్కారాన్ని అందజేసిన జె.బి. కల్చరల్ ఆర్ట్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, సంగీత అభిమానులు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

